స్కెచ్

# బ్రతుకు భారం

మరువాడ నారాయణమూర్తి

ఇంట్లో—"దిక్కూ దొక్కూ యెదుగూ లేదు, బొదుగూ లేదన్నట్లు..."

అప్పుడే భోజనంచేసి పెండింగు ఫైళ్లు చూచుకొంటూన్న నాకు పైమాటలు వినబడినై. ఇది మా గృహలక్ష్మి యెవరి నుద్దేశించి అంటూందో నే నెరుగుదు. అటువంటప్పుడు మళ్ళీ ఆమెని నిలేసి అడగడం దేనికి? అడిగానో ఆవిడ ఖచ్చితంగా "ఇది నిన్ను గురించే" అనేస్తే నేనెంతగా బాధపడాలో ఆలోచించరే! అందుకే వినీ విననట్లు వూరుకొని నా పనిలో లీనమైపోయాను.

ఏమిటో ఆమె గాఢస్తంగాని పెద్ద వుద్యోగాలు చెయ్యాలని యెవరికుండదు? ఈ నౌఖరీలో వున్న 'సాధక బాధకాలు' తెలిసేను స్తేగా యీ ఆడాళ్ళకి? తెలిసిన ఆడదైతే చెట్టంత యల్.డి.సి మగణ్ణి ఆవిధంగా అనగలదేమో చెప్పండి!

ఈ గుమస్తా గిరిలో ప్రవేశించి నేనింతవరకూ యేమి సాధించాను? ముందేమి సాధించగలను? ఆలోచించినా అర్థంకాదు.

శలభాలు నిరాశాభావంతో ఆరిపోయిన ప్రమిదలలో కొట్టుకొంటున్నాయ్ జ్వాల అంతరించిన ఆవేదనలో. "నీవు యీ దీపానికి తేజస్సు ఇయ్యి. మేము మరణించి మాలాలసతని పూర్తి చేసికొంటాం. సుఖంలో మరణంతో కూడిన సుఖమే యీ ప్రాణులు వాంఛించేవి. కష్టకాలంలో మృత్యువు అమూల్యమైనది. సుఖానికీ, కష్టానికీకూడ మాకు మరణవాంఛ దక్క అన్య కోర్కె శూన్యం, జీవన్మరణాల కంతరంవుంది. జీవనవాంఛే నశిస్తే మృత్యువు వెల అధికమౌతుంది" అని ఒక శలభం ప్రమిద అంచునకూర్చుని నిశానాథుని ప్రార్థిస్తూంది.

ఈ దృశ్యం నేను వీక్షించేనరికి నేనూ నిరాశాభావంతోకూడిన ఓ శలభాన్నే అనిపించింది.

అయినా యిదివర కెంతమంది యీ గుమస్తా గిరీ చెయ్యలేదు? ఇపుడెంతమంది చేస్తూన్న వాళ్లు లేరు? ముందు యెంతమంది చెయ్యరు?

నాచుట్టూ లక్షలాధి కంఠాలు "నువ్వు గుమస్తావి-నువ్వు గుమస్తావి" అని అరుస్తున్నాయ్. నేను యెలుగెత్తి "ఔను! నేను గుమస్తానే నేనో గుమస్తాగాణ్ణి" అని అరచాను. చేస్తూన్న పనిని దాచుకోవడమనే పిరికితనమంత నీచత్వం మరోటి వుండదేమో!

"ఈ యెనభై నాలుగుతోనూ సంసారంయెట్లా యీడుస్తారో నాకర్థంకాదు" అంటుంది గృహలక్ష్మి. నాకొకటి అర్థమై చచ్చిందా యెట్లా యీడుస్తానో యీవిడికి అర్థంకాకపోడానికి! నేను కావలసి, వాలంటరీగా, మహోదానందంతో యీ వుద్యోగం వెలగబెడుతున్నానని ఆవిడ అనుకోడం నాలో జుగుప్స రేకెత్తించింది. "కాలంపుగీతి యెప్పుడేది యెటు భోగ్యంబౌనో అప్పుడపాటునా..." వెనుకటికొకసారి "స్మశాన వాటిక"లో హరిశ్చంద్ర పాత్ర అభినయిస్తూ పాడినపద్యం జ్ఞాపకానికొచ్చింది.

పరిస్థితులకు తట్టుకోలేకపోతే జీవితమే వ్యర్థం కావొచ్చు. ఈ చిన్న రహస్యం తెలుసుకోలేని వ్యక్తుల జీవితాలెట్లావున్నాయో నేను చూస్తున్నదేగా!

* * *

ఆఫీసులో అడ్మినిస్ట్రేషన్ రిపోర్టు టైపు చేస్తున్నా. ప్రక్కనే కూర్చున్న శాస్త్రి "ఏమిటి సార్ ఆ మోత! తలనొప్పిగావుంది. కాస్త స్పీడు తగ్గించండీ" అని.

"రివర్షనొచ్చిందీ" అంటూ వొక అపార్థుడు అపహాస్యంచేశాడు వాడి బ్రతుకేదో ఘనంగా వున్నట్లు.

వీరి మానసిక ప్రవృత్తి తల్చుకొంటేనే నాక సహ్యం. బ్రతుకు భారంతో నటనా, మోసమూ, అసహనమూ, యీర్ష్యా, ద్వేషమూ పట్టుబడతాయేమో! "యాచక యాచకో: శత్రు:"అన్నారిందుకే వెనకటికి. ఈ గుమాస్తాగాళ్లూ ఆ ముష్టివాళ్ళలాంటివాళ్ళే. ఒకర్ని చూస్తే మరొకరికి కిట్టదు. ఇది వీళ్ళ జీక్రమూ. చుట్టూవున్న పరిస్థి

తులూ, దుర్భరమైన, దుస్సహమైన సన్నివేశాలూ వీళ్ళకిచ్చిన మానవత్వం!

* * *

"ఏమండోయ్! ఎల్లుండికి పళ్ళూ, తమలపాకులూ, వొక్కలూ, శెనగలూ......"ఏమిటి అన్నట్లు ఆవిడకేసి వురిమినట్లు చూచాను. పాపం యెంత చిన్న బుచ్చుకుందో?

"సంజయుడు పుట్టినరోజు ఎల్లుండే" అంది ఆవిడ క్లుప్తంగా మరచిపోయిన నా విధ్యుక్తాన్ని యేదో జ్ఞాపకంచేస్తున్నట్లు.

బజారుకెడితే...

"ఈ నెలేనే కొంచెం జమకట్టేస్తేనేకాని..." అని ఒకరూ..."నాలుగ్గురోజుల్లో బాకీ చెల్లించాలి సార్"అని అల్టిమేటమిచ్చేవాడింకొకడూ... ఇదీవరుస.

"పైన యేదో విధంగా కాస్త తెమ్చుకొంటేనే గాని" శయ్యా మందిరంలో (వున్న రెండంటే రెండే గదులలో ఒంటుగది కానట్టిది) గృహలక్ష్మి యేదో అనబోయి, ఆగి నా ముఖంకేసి పరీక్షగా చూసింది నా రియాక్షన్ కోసం. అన్యాయాన్నీ, మోసాన్నీ ప్రతిఘటించే నా హృదయం గాయపడింది. ఎలక్ట్రిక్ షాక్ తిన్నట్లు ఫీలయాను. (బాకెట్ ఆటగాళ్ళూ, పజిల్ సాల్వర్లూ, రేస్ గాళ్లూ, స్పెక్యులేషనిస్టులూ నా చుట్టూ చేరి నన్నూ, నా గుమాస్తాపనినీ చూసి హేళనగా నవ్వుతో నృత్యం చేస్తున్నట్లనిపించింది. హార్టు బీటు యెక్కువైంది. పల్సురేటు అధిగమించింది.

ప్రభుత్వం దయతో కనికరించి ఈ గుమాస్తాలనే వర్గం నాశనం గాకుండా అన్ని ఎలవెన్సులూ కలిపి ఒకపూట తిండికి సరిపోయే భత్యాన్ని యిస్తూంటే సంతోషించక...! సుఫల, సుజల, మలయజశీతల, సస్యశ్యామలయైన భారతావనిలో నేడు ఒక్కపూట కూడా తిండికి లేక ఆకలికి మలమలలాడిపోయి హతాశులై, ఆత్మహత్య చేసుకొన్న, చేసుకొంటూన్న అభాగ్యులెందరు లేరు? వాళ్ళ కన్న, వీళ్లు నయంకాదూ? వెయ్యి రెట్లు. విధి, కర్మ, వేదాంతం, వైరాగ్యం వీటితో జీవితాన్ని ముడేసుకొంటేనే కాని జీవితానికి తృప్తీ, ఆనందమూ లేదు. అవే లేకపోతే జీవితం మీద విసుగూ, విరక్తీ, రోతా, అసహనమూ, ఒకటేమిటి అన్నీను.

మాగృహలక్ష్మి నాదిమెట్టవేదాంతమంటుంది. ఆవిడ వొట్టి పెసిమిస్టు. నేను ఆప్టిమిస్టుని. అంతే మా యిరువురికీ వ్యత్యాసం.

ఈ కాలంలో అన్యాయం, బూటకం, కృత్రిమము అన్నీ సర్వంగా చెలామణీ అయిపోతాయంటుంది ఆవిడ. ఆవిడ అనడమే కాదు నిజం కూడా అంతేలెండి. ఈ పాడులోకం అబద్ధం చెప్తే నమ్మినంత యిదిగా నిజంచెప్తే నమ్మదే! నిజం ముందు అబద్ధానికంత విలువవుంది. కాని తీరా చేద్దామనేసరికి కాన్షన్సు దెబ్బతినేస్తుంది. హృదయం కాస్త మొరడు దేరకుండా యింకా కాస్త సున్నితంగా వుండడానికదే కారణమేమో మరి. ఏమైనా కానియ్యండి! కుసంస్కారానికే విలువ. నిజమైన సంస్కారం కుళ్ళులాగ కంపు కొట్టేస్తుంది. కుసంస్కారాన్ని అలవరచుకోలేక, నిజ సంస్కారాన్ని వొదులుకోనూలేని నాలాంటి నిర్భాగ్యుల గతి యేంకాను! "ఏంకాను? చెప్పూ" అంటూంది హృదయంలో యేదో. ఏంచెప్పను? నాకుమాత్రం తెలిసి యేడిస్తేనా!

* * *

ఈమధ్య గృహలక్ష్మికేం బావుండటం లేదు. ఏమిటో యీ అస్వస్థతకి కారణం? హాస్పిటలుకి తీసికెడతానన్నాను. "అక్కర్లేదు లెద్దురూ" అంటుంది. ఏమిటో యీ నిర్లక్ష్యం బోధపడదు. వొచ్చే జీతమే చాలక అవస్థపడుతూంటే ముందు ఖర్చుకూడా ఎందుకని ఆమె అభిప్రాయమేమో! ఆమెని బ్రతిమిలాడాను. "ఒద్దనిచెప్తుంటే వినరేం ఖర్మ"చంటికిల్లవాణ్ణి అదమాయించినట్లు కసిరింది.

ఏమిటోచెప్పమని నిలదీసి అడిగేసరికి చెప్పక తప్పదన్నట్లు ముక్తసరిగా"ఏముంది చెప్పడానికి" అంటూ, యీ చెవిలో సున్నితంగా, మృదువుగా పడేసింది.

"భేష్! అయితే ఇంకేం! భారత రిపబ్లికన్ ప్రభుత్వానికి నాలాంటి..."

"చాల్లెద్దురూ! మీ మాటలు మీరూను" నవ్వుకొంటూ వెళ్ళిపోయింది పాలమనిషి పిలుస్తూందని.

ఆ స్నిగ్ధ నగవు నా గుమస్తా బ్రతుకు భారానికో పూలబాటలా తోచింది. ★